క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.10 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం పలాస కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన రఘు పాత్రుని హేమలత అనే దాత రూ. పది లక్షల విరాళం అందజేశారు. సింహగిరికి గురువారం వచ్చిన దాత రూ. 5 లక్షల విరాళాన్ని నగదు రూపంలో, మరో రూ. ఐదు లక్షలు చెక్కురూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. శాశ్వత అన్నప్రసాద పథకం బాండ్‌ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో వాకింగ్ వద్దు



పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

పెందుర్తి : మంచు ప్రభావంతో రోడ్డు సరిగా కనిపించని కారణంగా పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి మధ్యలో ప్రజలు వాకింగ్, రన్నింగ్ చేయవద్దని పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ కోరారు. ఇటీవల వాకర్స్ తరచూ మధ్య రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్న కారణంగా ఉదయం, సాయంత్రం వాకింగ్/రన్నింగ్ వంటివి రోడ్డు మధ్యలో కాకుండా బీఆర్‌టీఎస్ కుడి, ఎడమ వైపు చేయాలని సూచించారు.

నేటి నుంచి వికసిత్ భారత్

పరవాడ: మండలంలో ఈ నెల 5 నుంచి 12 వరకు వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.హేమసుందర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రచారం చేస్తారన్నారు. మండలంలో పెదముషిడివాడ గ్రామంలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలో కొలువైన షిర్డీసాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం బాబాకు నక్షత్ర హారతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి కీర్తనలు ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్ల సత్యనారాయణ రావు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో నాగుల చవితి పార్కును అభివృద్ధి చేస్తున్నందున, భక్తులు, దాతలు భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

మల్కాపురం: శ్రీహరిపురం లక్కీ అమర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వివిధ తరగతుల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనల స్టాళ్లను స్కూల్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచుతుందన్నారు. సోలార్ ప్లాంట్, వ్యర్థ నీటిని పరిశుద్ధ జలంగా మార్చే ప్రాజెక్ట్, ఆటోమేటిక్ సెన్సార్ లైట్లు మొదలగు ప్రదర్శనలను విద్యార్థులు ఏర్పాటు చేశారు.

మది నిండుగా.. పింఛన్ల పండగ

- అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు
- ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు అందించిన సీఎం జగన్

సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న సీఎం జగన్ అవ్వాతాతలకు నెలకు రూ. 3 వేలు పింఛన్ అందజేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇంటికి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి తమను ఆదుకుంటున్నారని, తమ బాధలు గుర్తించారని అంతా కొనియాడుతున్నారు. గతంలో పింఛన్ కోసం అగచాట్లు పడేవారమని.. ఇప్పుడు ఆ బాధలు లేవని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సబ్బవరం మండల పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు



పింఛన్ లబ్ధిదారులకు జంబో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: పింఛన్ల పంపిణీ విధానంలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడి తీసుకొచ్చారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి పింఛన్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెంచిన పింఛన్లతో పాటు నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.75 చొప్పున గ్రామంలో ఎంత మంది అర్హులు ఉన్నా 15 నుండి 20 మందికే ఇచ్చేదన్నారు. అటువంటిది దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పింఛన్‌ను రూ.200లకు పెంచి అర్హులందరికీ అందజేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేల నుండి రూ. 3 వేలకు పింఛన్ పెంచారన్నారు. సబ్బవరం మండలంలో 8,401 మంది లబ్ధిదారులకు రూ.2.45 కోట్ల పింఛన్లు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, వనం అచ్చెంనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడి బాబు, సర్పంచ్‌లు వద్దాది అప్పలరాజు, పిల్లల అప్పలనాయుడు, యర్రంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

93వ వార్డులో..

సింహాచలం : జీవీఎంసీ 93వ వార్డు 526 సచివాలయం పరిధిలోని గొల్లనారాయణపురంలో గురువారం పలువురు లబ్ధిదారులకు పెరిగిన రూ. 3 వేల పింఛన్‌ను వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బుడత అప్పలరాజు, బి.కనకరాజు, నక్క శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో..

పరవాడ: జనవరి నెలకు సంబంధించిన పెంచిన పింఛన్ సొమ్ము రూ.3000 వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పైల రేగారావు, సింహాద్రిరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెదముషిడివాడలో..

పరవాడ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రూ.3000 పెరిగిన పింఛన్‌ను పెదముషిడివాడ వైస్ సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ పావని, వెంకటలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

పెందుర్తి : పింఛన్ సొమ్మును రూ. 3 వేలకు పెంచి సీఎం జగన్ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం 502, 503 సచివాలయాలకు సంబంధించి లబ్ధిదారులకు గురువారం పింఛన్లు అందించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ జగనన్న న్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరూరి చినబాబు, రోమాల నూకరాజు, పేరూరి ప్రకాశం, బొడ్డు నారాయణమూర్తి, అంగటి సూరిబాబు, కేవీఆర్ లక్ష్మి, జొన్నాడ సాయి కృష్ణ, భవానీ, చిన్నంనాయుడు, సంగమేశ్వరరావు, వరూధిని, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



93 వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న దాసరి సత్తిబాబు తదితరులు



పెందుర్తిలో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ దేముడు



పింఛన్లు అందజేస్తున్న వైస్ సర్పంచ్ వెంకటలక్ష్మి

ఆర్థిక భరోసా కల్పించారు..



మాది మండలంలో ఇరువాడ గ్రామంలోని వ్యవసాయ కుటుంబం. నేను, నా భార్య జగ్గయ్యమ్మ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారం. ప్రస్తుతం వయసు మళ్లడంతో ఇద్దరం ఇంటికే పరిమితమయ్యాం. మా కుమార్తెకు వివాహం అయిపోయింది. జగనన్న పింఛన్‌ను రూ. 3 వేలకు పెంచి ఇచ్చారు. దాంతో మాకు ఆర్థిక భరోసా లభించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– డి. సన్యాసిరావు, ఇరువాడ గ్రామం, సబ్బవరం మండలం

ఒకరిపై ఆధారపడకుండా..



మాది మండలంలోని ఇరువాడ గ్రామం. నా భర్త ఇటీవల చనిపోవడంతో 2 నెలల వ్యవధిలోనే పింఛన్ మంజూరు చేసి అందించారు. కొడుకు, కూతురుకు వివాహాలు అయిపోయాయి. జగనన్న ఇచ్చిన పింఛన్‌తో ఒకరిపై ఆధారపడకుండా జీవనం సాగిస్తాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

– పూడి సోములమ్మ, ఇరువాడ గ్రామం, సబ్బవరం మండలం

మందులు, ఇంటి ఖర్చులకి సరిపోతున్నాయి..



నాకు 2019 వరకు రూ. వేయి పింఛన్ వచ్చేది. జగన్ బాబు ముఖ్యమంత్రి అయ్యాక మా పింఛన్ పెరిగింది. నాకు మొన్నటి వరకు 2,750 వలంటీర్ ఇంటికే తెచ్చి ఇచ్చేవాడు. దాంతోనే మాకు మందుల ఖర్చులు పోగా ఇంటి ఖర్చులకు సరిపోయేవి. తాజాగా పింఛన్ రూ.3 వేలు చేశారు. జగన్‌బాబు చల్లగా ఉండాలి.

– ఒమ్మి కనకమహాలక్ష్మి, 95వ వార్డు

కొడుకులా ఆదుకుంటున్నాడు..



ప్రభుత్వం అందించిన పింఛన్ ఇంత మొత్తం అందుకోవడం తొలిసారి. మాలాంటి నిరుపేదలకు నెలకు రూ.3,000 ఎంతో మేలు చేస్తుంది. సీఎం జగన్ మమ్మల్ని సొంత బిడ్డలా ఆదుకుంటున్నాడు. ఆయన పదికాలాల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– బల్లంకి సింహాచలం, 95వ వార్డు

పలు చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న ఏఎస్పీ టి.ఎస్.రావు



నిందితుడు పిల్లా నూకరాజు(ఫైల్)

పరవాడ: అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 10 చోరీ కేసులతో సంబంధం ఉన్న నిందితుడిని పరవాడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషినల్ ఏఎస్పీ పి.సత్యనారాయణరావు (క్రైం) చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామంలో గత నెల 7న జరిగిన చోరీలో అరతులం బంగారం, రెండు జతల వెండి పట్టీలు, రూ.8,500 నగదు అపహరణకు గురయ్యాయి.

ఈ కేసుకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు నేతృత్వంలో క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజును లంకెలపాలెం కూడలిలో గురువారం అదుపులోకి తీసుకుని ప్రశ్నయించారు. నిందితుడు నూకరాజు అనకాపల్లి జిల్లా రావికమతంలో 3, దేవరాపల్లిలో 2, చీడికాడలో 1, సబ్బవరం, కోటపాడు, బుచ్చెయ్యపేట, మంత్రిపాలెం ప్రాంతాల్లో 10 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ చోరీ కేసుల్లో నిందితుడు 28 తులాల బంగారం, 39 తులాల వెండి, రూ.1.48 లక్షల నగదును అపహరించినట్లు కనుగొన్నామని చెప్పారు. నిందుతుడి నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీని అతి తక్కువ సమయంలో ఛేదించిన పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, క్రైం ఏఎస్ఐ బి.ఎర్రునాయుడు, పోలీసులు ఎస్.నాగేంద్ర, జి.వి.వి.ఎస్.నాయుడు, ఎం.దివాకర్‌బాబు, జి.మోహన్‌ప్రసాద్, సీసీఎస్ ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ ప్రదీప్‌కుమార్‌లను ఏఎస్పీ పి.సత్యనారాయణరావు ప్రశంసించారు. సమావేశంలో పరవాడ సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ పి.ఈశ్వరరావు, క్రైం పోలీసులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన మద్దతు ధర కల్పిస్తాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు



ఆర్బి, సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: రైతులకు మెరుగైన మద్దతు ధర కల్పించడంతో పాటు దళారీల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం..

మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ముందుగా రూ.62 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ వాణిజ్య సముదాయాన్ని, మండల పరిషత్ ఆవరణలో రూ.17 లక్షలతో నిర్మించిన ఆర్బి, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కోటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ సభ్యులు బైలపూడి దేముడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, వనం అచ్చెంనాయుడు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, పీఏసీఎస్ కార్యదర్శి గొంప రమణ, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడి బాబు, సర్పంచ్‌లు వద్దాది అప్పలరాజు, పిల్లల అప్పలనాయుడు, యర్రంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యాషన్ రంగంపై అపోహ వద్దు'



మిస్ క్వీన్ పావనికి జ్ఞాపిక అందజేస్తున్న ఉషారాణి

సీతంపేట: కుటుంబ సభ్యుల సహకారంతో మిస్ అండ్ మిసెస్ క్వీన్ పోటీల్లో మిస్ విశాఖ క్వీన్ 2023గా నిలిచానని పావని అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు ఫ్యాషన్ రంగంలో రాణించడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. అపోహలు విడనాడి ఆకాంక్ష ఉన్న ప్రతి ఒక్కరూ ఫ్యాషన్ రంగంలో రావాలన్నారు. ఎంతో మంది పోటీ పడిన ఈ పోటీలో ప్రతిభ చూపి విజేతగా నిలిచానన్నారు. అనంతరం క్వీన్స్ ఈవెంట్ నిర్వాహకురాలు ఉషారాణి ఆమెకు జ్ఞాపిక అందజేసి అభినందించారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం



సీఐపీఈటీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: నిర్వాసిత గ్రామాల నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం కృషి చేస్తోందని ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చెప్పారు. ఈ మేరకు విజయవాడలో గురువారం ఏర్పాటైన సమావేశంలో సంస్థ సీఐపీఈటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. పరవాడ ప్రాంత నిరుద్యోగ యువతకు నైపుణ్యం కల్పించడం, వారి ఉపాధి, ఆదాయానికి తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నుంచి మిషన్ ఆపరేటర్ ఇంజెక్షన్ మోల్డింగ్, మిషన్ ఆపరేటర్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్స్‌పై రెండు బ్యాచులకు 6 నెలల రెసిడెన్షియల్ శిక్షణ కల్పిస్తామన్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 మంది నిరుద్యోగులు ఉంటారని చెప్పారు. శిక్షణ పొందగోరు అభ్యర్థులు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, సీఎస్సార్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీఎస్సార్ ఎగ్జిక్యూటివ్ శివం ప్రతాప్‌సింగ్, హెచ్‌ఆర్ డాక్టర్ సి.హెచ్.శేఖర్, సీఐపీఈటీ బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

నూరు శాతం ఓటరు నమోదే లక్ష్యం

మల్కాపురం: నూటికి నూరు శాతం అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా అంతా శ్రమించాలని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో) హుస్సేన్ సాహెబ్ పిలుపునిచ్చారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం ఓటు కార్డు పొందడం, ఓటు హక్కును సద్వినియోగపరచడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఓటు హక్కు విలువ తెలుసుకుని, దానిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. మన ఓటే దేశ భవిష్యత్తును మార్చుతుందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలలో సైన్స్ ఫెస్ట్



విద్యార్థుల సైన్స్ నమూనాను పరిశీలిస్తున్న సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులు గురువారం నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక ప్రదర్శనలు, నమూనాలు వారి ప్రతిభకు అద్దం పట్టాయి. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి వారు తయారు చేసిన నమూనాల్లో ఇమిడి ఉన్న సాంకేతికత, ప్రయోజనాలను, మానవ జీవితానికి ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, బి.మాధవి, బ్రహ్మానందరెడ్డి సైన్స్ నమూనాలకు తిలకించి విద్యార్థులను అభినందించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించి విశేష హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టంతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పరవాడ : స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జన్మ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ యూనిట్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు, ఎంఈవోలు దివాకరరావు, శేష శైలజ ముఖ్య అతిథులుగా హాజరై బ్రెయిలీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. బొడ్డు సత్యవతి సమకూర్చిన కేక్ కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. అనంతరం అర్జునరావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఘనతను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. బ్రెయిలీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బంగారు ప్రకాశరావు దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సీహెచ్ పద్మ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఆర్.ప్రియ, భవిత ఉపాధ్యాయులు కుమారి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ ఏకశిలలో మెయింటెనెన్స్ సెంటర్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్

సింధియా: ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏవీఎస్ఎం, వీఎస్ఎం ఐఎన్ఎస్ ఏకశిలాలో గ్యాస్ టర్బైన్‌ల ఇంటర్మీడియట్ లెవల్ మెయింటెనెన్స్ సెంటర్‌కు విశాఖపట్నం నేవల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జనరల్, వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్ శంకుస్థాపన చేశారు. భారతీయతను ప్రపంచ దేశాలకు చాటిచెప్పే ఈ కీలక ప్రాజెక్టులు గ్యాస్ టర్బైన్ టెక్నాలజీలో నేవీ నిబద్ధతకు అద్దం పడతాయని అధికారులు తెలిపారు.